క్లుప్తంగా

దోమల మందు పిచికారీ



ముదినేపల్లి రూరల్: విద్యాసంవత్సరం ప్రారంభమైనందున ముదినేపల్లిలోని వసతి గృహాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా దోమలమందు శుక్రవారం పిచికారీ చేశారు. మలేరియా వ్యాధి నివారణాధికారి కై కలూరు సబ్ యూనిట్ ఇన్‌చార్జి శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ బాలికల, బాలురు, బీసీ బాలుర వసతి గృహాల్లో దోమల నివారణకు మలాథియన్ మందును పిచికారీ చేశారు. సర్పంచ్ నిమ్మగడ్డ కై కమ్మ ఈ పనులను పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వర్షాకాలం రాబోతున్నందున దోమలు ప్రబలే అవకాశముందన్నారు. వసతి గృహాల్లోని విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

కైకలూరు: పాఠశాలలు, కాలేజీలు పునఃప్రారంభం సందర్భంగా కై కలూరు బీసీ బాలుర, బీసీ(కాలేజీ) బాలికల వసతి గృహాల్లో పంచాయతీ, వైద్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో దోమల నివారణ మందును పిచికారీ చేయించామని హెల్త్ సబ్ యూనిట్ అధికారి పీఎస్ఎస్.శ్రీనివాస్ చెప్పారు. వసతి గృహాల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఆర్.రవి ప్రసాద్, ఎం.రాధా, వైద్య సిబ్బంది జి.శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఈవో కె.తాతారావు, హెల్త్ సూపర్‌వైజర్ కె.రామారావు పాల్గొన్నారు.

భూముల కౌలు వేలం



ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరు పార్వతీ సమేత శ్రీసోమేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన భూముల కౌలు వేలం శుక్రవారం నిర్వహించారు. ఈ ఆలయానికి అల్లూరు, చిగురుకోట, బొమ్మినంపాడు గ్రామాల్లో 15.26 ఎకరాల పల్లం భూములు ఉండగా అల్లూరులో 6.81 ఎకరాల చేపల చెరువు ఉంది. వీటిని మూడు సంవత్సరాల కాలానికి లీజుకు ఇచ్చేందుకు ఆలయ ఆవరణలో కౌలు వేలం నిర్వహించారు. ఈ వేలంలో అధిక సంఖ్యలో పాటదారులు పాల్గొన్నట్లు ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఈ భూములకు అధిక ఆదాయం వచ్చిందని చెప్పారు. గతంలో పల్లం భూములకు రూ.1,69,790 ఆదాయం రాగా ప్రస్తుతం రూ.1,76,038 ఆదాయం వచ్చిందన్నారు. చేపల చెరువుకు వేలంలో దక్కించుకునేందుకు ఇద్దరు మాత్రమే ధరావత్తు చెల్లించినందున తిరిగి వేలం నిర్వహించేందుకు వాయిదా వేసినట్లు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్



పామర్రు: పామర్రు నియోజకవర్గ ఫొటో గ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకేతో అభినందనలు తెలిపారు. పామర్రు అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఏపీ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు నూతలపాటి త్రివిక్రమరావు, సభ్యులతో కలిసి ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ అసోసియేషన్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని అన్నారు. అనంతరం నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఆగస్టు 19వ తేదీ ఫొటో గ్రఫీ డే ఘనంగా నిర్వహించాలని తీర్మానించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫొటో గ్రాఫర్లు కె.నాగరాజు, శివకృష్ణ, ప్రసాద్, శేషు, చంటి, నరేష్ రంగారావు, సురేష్, నరేంద్ర, రాము, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ రాయుడి అరెస్ట్

గుడివాడరూరల్: క్రికెట్ బెట్టింగ్ రాయుడిని టూటౌన్ పోలీసులు గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. పట్టణంలోని బంగారపు షాపుల బజారులో ఉన్న శ్రీలక్ష్మీదుర్గ జ్యూయలరీ షాప్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు టూటౌన్ సీఐ ఎంవీ దుర్గారావు సిబ్బందితో కలసి షాపులో దాడులు నిర్వహించారు. షాపు యజమాని కూనసాని వినోద్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా కొంతకాలంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలింది. శుక్రవారం బంగ్లాదేశ్–నేదర్లాండ్ దేశాల మధ్య జరిగిన టీ–20 వరల్డ్‌కప్ మ్యాచ్‌కు సంబంధించి బెట్టింగ్‌లు చేస్తున్నట్లు విచారణలో తేలడంతో వినోద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సీఐ ఎంవీ దుర్గారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ తెలిపారు. పట్టణంలో చట్టవిరుద్ధమైన జూదాలు, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

సాగుకు సమాయత్తం



మెట్ట మడులలో విత్తనాలను చల్లుతున్న రైతులు

పామర్రు: ఖరీఫ్ సాగు పనులు మొదలయ్యాయి. వాతావరణం అనుకూలంగా ఉండటంతో మండల పరిధిలో పలు ప్రాంతాల్లో రైతులు తమ పొలం పనులను శుక్రవారం ప్రారంభించారు. నేలను దమ్ము చేసి నారుమళ్లకోసం మడులను తయారు చేసే పనుల్లో నిమగ్నమవుతున్నారు. మండలంలో 23,500 ఎకరాల్లో వరి సాగు చేస్తారు. ఇందుకోసం ఇప్పటికే సిద్ధం చేసిన మడులలో వరి విత్తనాలను చల్లుతున్నారు. కొన్ని ప్రాంతాలలో మెట్ట మడులను తయారు చేసుకుని నారుమళ్ల కోసం విత్తనాలను చల్లకుంటున్నారు. పొలంలో దంపమడిని తయారు చేసి వరి విత్తనాలను చల్లుతున్నారు. మరి కొన్ని గ్రామాలలో మెట్ట మడులలో వరి విత్తనాలను నారుమళ్లలో వేస్తున్నారు. 1318 రకం వరి విత్తనాలను అధికంగా మడులలో చల్లుతున్నారు.

బోరు నీటితో..

ప్రస్తుతం బోర్ల సహాయంతో, వర్షపు నీటితో నారుమళ్ల పోసుకుంటున్నారు. వారం తర్వాత నారుమళ్లకు నీటి అవసరం ఉంటుందని రైతులు తెలిపారు. ప్రస్తుతం వరి సాగు అవసరాలకు నీరు లేక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువల ద్వారా నీరు రాక పోవడంతో పాటు కనీసం వరుణుడు కూడా కరుణించక పోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి సాగు నీటిని విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

సోలార్ విద్యుత్‌తో..

మోటార్లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లులు చెల్లించాలంటే తలకు మించిన భారమే. ఈ ఖర్చును అధిగమించేందుకు సేద్యానికి సౌర విద్యుత్ తోడ్పాటు అందిస్తోంది. కొందరు రైతులు సోలార్ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసుకున్నారు. మెట్ట, మాగాణి ప్రాంతాల్లో చాలా మంది సోలార్ విద్యుత్ పలకలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ విద్యుత్‌తో నారుమడులు పోసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇలా అందుబాటులో ఉన్న వనరులను వినియోగించి నారు పెంచుతున్నారు.

20 ఎకరాలు సాగు చేస్తున్నా..

ఇప్పటి వరకు కురిసిన వర్షాల ద్వారా వచ్చిన నీటితో నారుమళ్లు పోసుకుని సాగుని ప్రారంభిస్తున్నాం. 20 ఎకరాలలో సాగు చేపట్టాను. కాలువల ద్వారా సాగుకు నీటిని సకాలంలో విడుదల చేసి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. వరి సాగుకు శ్రీకారం చుట్టాం. ప్రస్తుతం నారుమళ్లు పోస్తున్నాం.

–కందుల మస్తాన్‌రావు, రైతు, పామర్రు

ప్రస్తుతం వర్షపు నీరే దిక్కు..

ప్రస్తుతం వర్షాలకు వచ్చిన నీటిని ఇంజిన్లతో తోడించి వరి నారుమళ్లకు నీరు అందిస్తున్నాం. కాలువల ద్వారా పూర్తి స్థాయిలో నీటి విడుదల చేస్తేనే ఆకుమడులకు నీరు అందించగలం. సత్వరమే సాగుకు నీరు అందించాలి.

–కె.నరసింహారావు, రైతు, పామర్రు

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేద్దాం

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

గుడివాడ టౌన్: పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేద్దామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ సమావేశం హాలులో ఇంజినీరింగ్ అధికారులు, 36 వార్డుల సచివాలయ ఇమ్యూనిటీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్యకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా మద్దతు ఉంటుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కళాశాల కరస్పాండెంట్‌గా నిర్మల



కరస్పాండెంట్ నిర్మలకు స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్ సుజాత

గుడివాడరూరల్: గుడివాడ కేటీఆర్ మహిళా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్‌గా పర్వతనేని నిర్మల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కళాశాలలో శుక్రవారం పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేటీఆర్ మహిళా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్‌గా పర్వతనేని నిర్మలను ఏకగ్రీవంగా పాలకమండలి సభ్యులు ఎన్నుకున్నారు. ఆమెకు ప్రిన్సిపాల్ కేబీ సుజాత పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ యాజమాన్యం, పాలకవర్గం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కళాశాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణ, అంకితభావంతో చదువుకుని కళాశాల ఖ్యాతిని ఇనుమడింప చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలనే వినియోగించాలి



పామర్రులోని ఓ దుకాణంలో విత్తనాలను పరిశీలిస్తున్న ఏవో శివనాగరాణి

పామర్రు: మంచి నాణ్యమైన పంట దిగుబడులు రావాలంటే నాణ్యమైన విత్తనాలను వినియోగించాలని మండల వ్యవసాయాధికారి శివనాగరాణి అన్నారు. మండల పరిధిలో పలు విత్తన విక్రయ కేంద్రాలను ఆమె శుక్రవారం పరిశీలించి, నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాసిరకం విత్తనాలను కొందరు వ్యాపారులు రైతులకు అంటగడుతున్నారు. అటువంటి పరిస్థితిని నివారించేందుకు విత్తన దుకాణాలలో పరిశీలనలు చేపడుతున్నామని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని అన్నారు. విత్తనాల కొనుగోళ్లలో రైతులు కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విత్తన బ్యాగ్‌లపై ఉన్న ట్యాగ్‌లను పరిశీలించి అది ఏరకం విత్తనాలో, వాటి సమయం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కొనుగోలు చేసిన విత్తనాలను దుకాణం నుంచి బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. దుకాణాలలో ఉన్న వరి వంగడాల నమూనాలను సేకరించి వాటిని ల్యాబ్‌లకు పంపి పరీక్షిస్తామని తెలిపారు. వచ్చిన రిపోర్టుల ఆధారంగా ఆయా దుకాణాలకు అనుమతులు ఇస్తామని చెప్పారు. కృష్ణవేణి సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్, విజయలక్ష్మి ఏజెన్సీ దుకాణాలలో తనిఖీలు చేసి విత్తనాల నమూనాలను సేకరించామని అన్నారు. కార్యక్రమంలో దుకాణాల యజమానులు జగదీష్, జీ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే



దేవరపల్లిలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



భూషణగుళ్లలో అంగన్‌వాడీ విద్యార్థుల ర్యాలీ

తోట్లవల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి తెలియజేశారు. మండలంలోని గరికపర్రు అంగన్‌వాడీ కేంద్రంలో మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం శుక్రవారం జరిగింది. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్చుకోవటం, ఐదేళ్లు నిండిన చిన్నారులను పాఠశాలలకు పంపిస్తున్నామని నాగమల్లేశ్వరి తెలిపారు. దేవరపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ సుజాత తల్లులకు అవగాహన కలిగించారు. అనంతరం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. గరికపర్రు పాఠశాల హెచ్‌ఎం కేపీ రవికాంత్, ఉపాధ్యాయురాలు జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, రాధిక, కనకదుర్గ, విజయలక్ష్మి, పీకేడీపీ లక్ష్మి, రత్నకుమారి, అనూరాధ, లక్ష్మీతిరుపతమ్మ పాల్గొన్నారు.

కొర్నిపాడు(పెదపారుపూడి): మండలంలోని కొర్నిపాడు, భూషణగుళ్ళ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే, 'అంగన్‌వాడీ పిల్లుస్తుంది' కార్యక్రమాలను నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్లు శివనాగమణి, అరుణకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో కాన్వెంట్లకు ధీటుగా విద్యాబోధన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పమిడిముక్కల: చోరగుడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐదేళ్లు నిండిన పిల్లల్ని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం ద్వారా మూడు సంవత్సరాలు నిండిన పిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోకి ఆహ్వానించారు. సెక్టార్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. మండలంలోని వేల్పూరు, ముళ్లపూడి అంగన్‌వాడీ కేంద్రాలలో గ్రాడ్యుయేషన్ డే, అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లు అందజేశారు. సెక్టార్ సూపర్‌వైజర్ ఉష మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు దుర్గ, అంజలి, రమణ, ప్రేమలత పాల్గొన్నారు.

66 మంది రక్తదానం



రక్తదానం చేసిన విద్యార్థులతో ఎమ్మెల్యే రాము

గుడివాడ టౌన్: ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టులు, కళాశాలల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. విద్యార్థులను అభినందిస్తూ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సర్టిఫికెట్ ప్రధానం చేశారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కొనకళ్ల సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 16 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ సీతయ్య, ఎం.నాగ మల్లేశ్వరరావు, కె.నాగరాజు, ఆనంద్ కుమార్, ఎం.రామకృష్ణ (ఆర్‌కే) పాల్గొన్నారు.

విగ్రహాలకు తొలగిన ముసుగులు

సాక్షి ఎఫెక్ట్



ముసుగులు తొలగించిన విగ్రహాలు

గుడివాడ టౌన్: పురపాలక సంఘ పరిధిలోని రాజకీయ ప్రముఖుల విగ్రహాల ముసుగులను శుక్రవారం తొలగించారు. ఎన్నికల కోడ్ వెలువడిన అనంతరం రాజకీయ నాయకుల విగ్రహాలు కనిపించకుండా ముసుగులు వేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే వాటిని తొలగించాల్సిన బాధ్యత పురపాలక సంఘ అధికారులపై ఉంది. ఈనెల 6వ తేదీన కోడ్ ముగిసినప్పటికీ గుడివాడ పురపాలక సంఘం పరిధిలో విగ్రహాలకు ముసుగులు తొలగించక లేదు. ఈ విషయమై సాక్షి దినపత్రికలో ఈనెల 13న 'కోడ్ ముగిసినా ముసుగులు తీయరా' అంటూ కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పురపాలక సిబ్బంది నాయకుల విగ్రహాలకు కప్పిన ముసుగులను శుక్రవారం తొలగించారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

గుడివాడ టౌన్: పురపాలక సంఘ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఆరో తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బెల్టులు, బ్యాగులు, ఇతర సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్‌లో అన్ని తరగతులకు సంబంధించి 430 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం టీఎమ్‌ఈ రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ జి.సుమిత్ర, వ్యాయామ ఉపాధ్యాయుడు మడకా ప్రసాదు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

మొవ్వ: విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరానికి అవసరమైన నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం మండలంలో చేపట్టారు. ఆయా పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ప్రజా ప్రతినిధులు చేతుల మీదగా పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. దీనిలో భాగంగా కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎన్.శేష సాయికుమార్ ఆధ్వర్యంలో నాయకులు కొండవీటి అమర బాలేశ్వరరావు విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యాశాఖ అందిస్తున్న పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యప్రసాద్, మాణిక్యాలరావు, శ్రీనివాస నెహ్రు, దానారావు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం విరిగిపోయినా పట్టించుకోరా..!



విరిగిపోయిన విద్యుత్ స్తంభం

యద్దనపూడి(మొవ్వ): గత నాలుగు రోజులుగా విద్యుత్ సౌకర్యం లేక యద్దనపూడి గ్రామానికి చెందిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని పాలకేంద్రం సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఓ వాహనం ఢీ కొనటంతో గత బుధవారం సాయంత్రం విరిగిపోయింది. స్థానికులు అధికారులకు తెలిగిచేయగా విద్యుత్ సరఫరా నిలిపివేసి వైర్లు పక్కన పడవేశారు. నాటి నుంచి విద్యుత్ పునరుద్ధరణ చేయలేదు. ఈ స్తంభం పరిధిలోని కుమ్మరి బజారులోని 16 సర్వీసులకు చెందినవారు ఉన్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని అధికారులకు కోరుతున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని విన్నవిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పామర్రు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటలకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ ఏఈఈ మోహనకృష్ణారావు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని కొమరవోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్‌ను నిలుపుదల చేస్తామన్నారు. మండల పరిధిలోని కనుమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

తోట్లవల్లూరు: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఉయ్యూరు ట్రాన్స్‌కో ఈఈ కృష్ణానాయక్ తెలియజేశారు. తోట్లవల్లూరు, యాకమూరు, వల్లూరుపాలెం, పాములలంక, పెనమకూరు, దేవరపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

ముదినేపల్లి రూరల్: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థిని ఇంటర్ చదివేందుకు స్థానిక నేతలు ఆర్థిక సాయం అందించారు. ముదినేపల్లికి చెందిన షేక్ షఫీ కుమార్తె షబీనా ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణురాలై ఇంటర్మీడియట్ చదివేందుకు సిద్ధపడింది. ఈమె ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న స్థానిక బొర్రా బాలసాయి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, టీడీపీ నాయకుడు కొడాలి వినోద్ సాయంతో రూ.10 వేల ఆర్థికసాయాన్ని షబీనాకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో షేక్ నూరేళ్ళ, మహ్మద్ రియాజ్, షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

విద్యతోనే మానవ వికాసం



కై కలూరు: విద్యతో మానవ వికాసం సాధ్యపడుతుందని కై కలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ.లక్ష్మి చెప్పారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి నెల రోజులు బాల కార్మికుల నిర్మూలనపై దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. బాలలను ప్రమాదకర పనుల్లో వినియోగిస్తే సదరు యజమానులకు 3 నెలల నుంచి ఏడాది పాటు జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. బాల కార్మికులను ఎవరైనా గుర్తిస్తే 1098, 7222 టోల్ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో కై కలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేంపాటి సాయి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎస్.రాజు, ప్యానల్ న్యాయవాదులు పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్, హెచ్‌ఎం శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వీఏఏలు అందుబాటులో ఉండాలి

డీఏవో పద్మావతి



మాట్లాడుతున్న డీఏవో పద్మావతి

పెదపూడి(మొవ్వ): గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉంటూ అవసరమైన సాంకేతిక సలహాలను అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. పద్మావతి సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ సిబ్బంది సన్నద్ధంగా ఉండాలన్నారు. ఆర్‌బీకేల్లో విత్తనాలు పంపిణీ చేసిన వెంటనే ఆన్‌లైన్ చేయాలని సూచించారు. శుక్రవారం కూచిపూడి–పెదపూడి వర్తక కల్యాణ మండపంలో మొవ్వ సబ్ డివిజన్ పరిధిలోని చల్లపల్లి, ఘంటసాల, మొవ్వ మండలాల గ్రామ వ్యవసాయ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఏవో మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదులో రైతుల వివరాలు, వాస్తవ సాగుదారుల వివరాలు సేకరించి సిద్ధంగా ఉండాలన్నారు. వీఏఏ ఆయా గ్రామాల్లో మట్టి నమూనాలు సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఎస్.శ్యామల, మచిలీపట్నం ఏడీఏ ఎస్.మణిధర్, సాంకేతిక వ్యవసాయ అధికారులు బి. సురేష్‌బాబు నాయక్, సీహెచ్ శాంత, జీ గీతాదేవి, ఏవోలు కే శివకుమార్, కే మురళీకృష్ణ,జి సాయి సింధు, ఎం రామ్మోహన రావు (టెక్నికల్) పాల్గొన్నారు.

వైభవంగా రాజశ్యామలా హోమం

కైకలూరు: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటూ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనంద సూర్య, అనురాధ దంపతులు కైకలూరు శ్యామలాంబ దేవాలయంలో శ్రీ రాజశ్యామల హోమం ఘనంగా నిర్వహించారు. మచిలీపట్నానికి చెందిన లొల్లా కుటుంబశాస్త్రి నిర్వహణలో 9 మంది వేద పండితులు క్రతువును పూర్తి చేశారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన బ్రాహ్మణ సంఘ నాయకులు, కైకలూరు ఎంపీపీ అడివి కృష్ణ, పీవీ ఫణికుమార్, గూడూరు హనుమంతరావు, వారణాసి దుర్గా సారథి, నందరాజు ప్రకాష్, కాళిదాసు, గన్నవరపు శ్రీనివాస్, ఆర్‌కే మూర్తి పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

గుడివాడ టౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ కన్వీనర్‌లు డి. సూర్యచంద్రరావు, జి.కిరణ్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లో టీఎల్‌పీ అండ్ ప్రభావతి గార్డెన్స్‌లో ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు ఈ వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. పట్టణ పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఏడాది పొడుగునా ప్రతి మొదటి ఆదివారం, మూడవ ఆదివారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సహజ వ్యాధులతో పాటు గుండె, నరాలు, ఆర్థోపెడిక్ సమస్యలకు వైద్యపరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.